క్లుప్తంగా

సుబ్బారాయుడి సేవలో నాగిరెడ్డి దంపతులు



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నిత్యాన్నదానానికి రూ. 55 వేల విరాళం



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి జంగారెడ్డిగూడెంకు చెందిన భక్తులు కూచిభొట్ల వెంకట ప్రభాకర్ శర్మ, సీతాకుమారి దంపతులు రూ. 55,558 విరాళంగా అందజేశారు. ఆదివారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు విరాళాన్ని అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

రామాలయం పునర్నిర్మాణానికి భూమి పూజ



కోనేరుసెంటర్: మండల పరిధి బొర్రపోతుపాలెం పంచాయతీ శివారు పిల్లంగోళ్లపాలెంలో రామాలయం పునర్నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు ఆదివారం భూమి పూజ చేశారు. సర్పంచి గట్టే సుశీల మణి, గ్రామ ఇన్‌చార్జి నట్టే ప్రసాద్, మాజీ సర్పంచ్ నట్టే గాయత్రీ దేవి భూమి పూజలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా కిట్టు గ్రామస్తులతో మాట్లాడుతూ రామాలయం పునర్నిర్మాణానికి గ్రామస్తులంతా ఐక్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉయ్యూరు నాగ బుల్లబ్బాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వామి వారికి పాల కావడిలతో పూజలు



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి అయ్యప్ప గురుస్వామి తంగల సురేష్‌బాబు ఆధ్వర్యంలో పాల కావడిలతో పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం వేకనూరు నుంచి 18 మంది కన్నెస్వాములు పాల కావడిలతో మొత్తం 60 మంది అయ్యప్పలు 11 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తూ మోపిదేవి చేరుకున్నారు. గత ఐదేళ్లుగా పాల కావడిలతో పాదయాత్ర చేస్తూ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేస్తున్నామని గురుస్వామి వివరించారు.

బందరులో 99.01 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఐదో రోజు ఆదివారం నగరంలో కొనసాగింది. నగరంలో 99.01 శాతం పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. మొత్తం 19,048 పింఛనుదారులు ఉండగా వీరిలో 18,860 మందికి పింఛను సొమ్ము అందజేశారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేడి నైవేద్యాలను సమర్పించారు. సర్కారు కాల్వపై కర్రల వంతెన స్థానంలో వారధి నిర్మించడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలలో వేలాది మంది భక్తులు నేరుగా అమ్మవారి దేవస్థానానికి చేరుకుంటున్నారు. ఆలయ ఈవో కందుల వేణు గోపాలరావు భక్తులకు కావల్సిన ఏర్పాట్లు పర్యవేక్షించారు. సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా పెద్ద అనివేటి మండపం పనులు దేవాలయం వద్ద శరవేగంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఈవో తెలిపారు.

రెండు రోజులు.. 674 దరఖాస్తులు

- పెడన నియోజకవర్గంలోని 216 బూత్‌లలో ప్రత్యేక శిబిరాలు
- ఓటు నమోదుకు కొత్తగా 424 మంది అర్జీలు
- తొలగింపునకు 72, మార్పులకు 178 మంది దరఖాస్తు



పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్‌లోని పోలింగ్ స్టేషన్‌లో ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న ఈఆర్ఓ రాజ్యలక్ష్మి

పెడన: పెడన నియోజకవర్గంలో ఓటర్ల నమోదు కోసం అధికారులు శని, ఆదివారాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. శిబిరాలలో ఓటర్ల జాబితాలను ప్రదర్శించడంతో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు ఉన్నది, లేనిదీ సరిచూసుకున్నారు. కొత్తగా కొందరు నమోదు కోసం, మరి కొందరు తొలగింపునకు, మరికొందరు బూత్‌ల మార్పునకు దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 1,62,832 మంది ఓటర్లు ఉన్నట్లు ఇటీవల ఎన్నికల అధికారులు ముసాయిదా జాబితాలను విడుదల చేశారు. ఈ జాబితాలను సరిచూసుకుని తమ పేర్లు లేకపోతే ఓటరుగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని, మార్పులున్నా, కొత్తగా ఓటరు నమోదుకు, అలాగే ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, మృతిచెందిన వారి పేర్ల తొలగింపునకు అవకాశం కల్పించారు. పెడన నియోజకవర్గంలోని 216 పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక శిబిరాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. శిబిరాల ద్వారా పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 674 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో ఫారం-6కు సంబంధించి కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి 424, తొలగింపునకు ఫారం- 7కు 72, మార్పులు చేసుకునేందుకు ఫారం-8కు 178 దరఖాస్తులు వచ్చాయి.

డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం..

కొత్తగా ఓటరు నమోదుకే కాకుండా తొలగింపులకు, మార్పులకు కూడా మండల రెవెన్యూ కార్యాలయాల్లోని ఎన్నికల విభాగాల్లో డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అలాగే డిసెంబరులోని 2, 3వ తేదీలలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కూడా ప్రత్యేక ఓటరు నమోదుతో పాటు తొలగింపులు, మార్పులకు సంబంధించి శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని ఎన్నికల అధికారి, ముడా వీసీ కె. రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు ఉందో లేదో ఓటరు జాబితాలను స్వయంగా పరిశీలించుకుని చూసుకోవాలని ఆమె కోరారు. ఎన్నికల సమయంలో హడావుడి పడకుండా ఓటు ఉందో, లేదో ముందుగానే చూసుకోవాలని, లేకుంటే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదివారం ఆమె పట్టణంలోని ఎనిమిది పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈమెతో పాటు మున్సిపల్ టీపీఓ ఏసుబాబు ఉన్నారు.

మండలాల వారీగా ఇలా..

మండలం	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం
గూడూరు	89	22	18	129
పెడన రూరల్	91	11	33	135
పెడన అర్బన్	73	22	57	152
బంటుమిల్లి	72	09	24	105
కృత్తివెన్ను	99	08	46	153
మొత్తం	424	72	178	674

సక్రమంగా ఓటర్ల నమోదు

- ఆర్డీఓ వాణి
- పోతేపల్లె సచివాలయం సందర్శన



పోతేపల్లిలో ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వాణి



మోపిదేవి పోలింగ్ బూత్ వద్ద ఓటరు లిస్టులను పరిశీలిస్తున్న పార్వతి

కోనేరుసెంటర్: జాబితా ప్రకారం ఓటర్ల నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నామని ఆర్డీఓ ఎం. వాణి అన్నారు. మండల పరిధిలోని పోతేపల్లి సచివాలయాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయం పరిధిలోని ఓటర్ల జాబితాలను పరిశీలించారు. బీఎల్ఓలకు ఓటర్ల జాబితాకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులను పరిశీలించిన ఆమె గతంలో ఓటు హక్కు ఉండి మరణించిన వారు ఎవరైనా ఉంటే సంబంధిత పేర్లను తొలగించింది, లేనిది ఆరా తీశారు. ఉన్న ప్రాంతాల నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు సరిచేసింది లేనిది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న వారు ఓటు నమోదు చేయించుకోవాలి..

మోపిదేవి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వి. పార్వతి అన్నారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు బూత్ లెవెల్‌లో నిర్వహించిన శిబిరాలను మోపిదేవి జెడ్పీ పాఠశాల బూత్‌లో ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, లిస్టులో తప్పులు వచ్చిన, లేక ఫొటోలు తప్పుగా పడినా, అడ్రస్ మార్పులు ఉన్నా మరొకసారి పరిశీలించాలని ఆదేశించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ మండలంలోని మొత్తం 38 పోలింగ్ బూత్‌ల వద్ద ఆదివారం ఓటర్ల జాబితాను వెరిఫికేషన్ కోసం బీఎల్ఓలు ఏర్పాటు చేశారని ఆమెకు తెలిపారు. ఇప్పటి వరకు 28,130 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 13,944, మహిళలు 14,186 మంది ఉన్నారని చెప్పారు. శిబిరాల్లో మొత్తం 52 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో చేర్పులకు 35, ఫారం 7లో డెత్, గ్రామంలో లేనివి 9, ఫారం 8లో తప్పులుగా గుర్తించిన అర్జీలు 8 వచ్చాయని వివరించారు. బీఎల్‌లు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ..

కోడూరు: ఓటర్ల లిస్టులో అభ్యంతరాల స్వీకరణకు అధికారులు అదివారం కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. మండలంలోని 48 పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఫారం-6కు సంబంధించి 66, ఫారం-7కు సంబంధించి 25, ఫారం-8కు సంబంధించి 36 అర్జీలు అందాయని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. ఓటర్ల లిస్టులో సవరణలు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను బీఎల్వోలు నిర్వహించారు. ఆర్ఐ సుభాషిణి, ప్రత్యేకాధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, బీఎల్వోలకు పలు సూచనలు చేశారు.

టీడీపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- విలేకరుల సమావేశంలో గుండుపాలెం గ్రామస్తులు
- వైఎస్సార్‌పై అభిమానంతోనే అన్నివర్గాలతో కలిసి విగ్రహ ఏర్పాటు



విలేకరులతో మాట్లాడుతున్న గుండుపాలెం గ్రామ పెద్దలు

కోనేరుసెంటర్: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఆయనపై అభిమానంతో అన్నివర్గాలకు చెందిన గ్రామస్తులు వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటే ఓర్వలేని తెలుగుదేశం పార్టీ నాయకులు విగ్రహ ఏర్పాటును రాజకీయం చేయాలని చూస్తున్నారని గుండుపాలెం సొసైటీ అధ్యక్షుడు తోమాటి భాస్కరరావు అన్నారు. అందులో ఎమ్మెల్యే పేర్ని నానిపై బురద జల్లుతూ దిగజారుడు రాజకీయాలకు దిగడం సిగ్గుచేటని చెప్పారు. ఆదివారం మండల పరిధిలోని గుండుపాలెం సొసైటీ ఎదుట ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద గ్రామ పెద్దలు విలేకరులతో మాట్లాడారు. భాస్కరరావు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రుద్రవరం, గుండుపాలెం పంచాయతీలకు సంబంధించి సుమారు రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేసి రహదారుల అభివృద్ధికి సహకరించారన్నారు. రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకాలను అత్యధికంగా గ్రామస్తులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఇపుడు ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామంలోని సుమారు 200 కుటుంబాలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయడంతో గృహ నిర్మాణాలు చేపట్టారన్నారు. గ్రామానికి అన్ని రకాలుగా ఉపయోగపడిన ఆ కుటుంబానికి గ్రామం తరపున ఎంతో రుణపడి ఉంటామన్నారు. గ్రామాభివృద్ధికి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషికి అభిమానంతో రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటే టీడీపీ నాయకులు అడ్డుపడేందుకు ప్రయత్నించడం సహేతుకం కాదన్నారు. గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ నాయకులు విగ్రహ ఏర్పాటును రాజకీయం చేయాలని చూడటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసినప్పుడు మేమంతా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానంతో విగ్రహ ఏర్పాటుకు సహకరించామని గుర్తు చేశారు. ఇప్పుడు అదే నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ఏర్పాటుకు అడ్డు తగలాలని చూడటం భావ్యం కాదన్నారు. ఈ విషయంలో తమ నాయకుడు పేర్ని నానిపై బురద జల్లేందుకు పూనుకోవటం సహేతుకం కాదన్నారు. గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే పేర్ని నానిపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ప్రతిపక్ష నాయకులు మానుకోవాలని హితవు పలికారు. గ్రామ ఇన్‌చార్జి అంగడాల ఫణికుమార్ మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి విగ్రహ ఏర్పాటుకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకరించారని తెలిపారు. విలేకరుల సమావేశంలో గ్రామ పెద్దలు తిరుమలశెట్టి ఏడుకొండలు, తూమాటి శ్రీనివాసరావు, తెనాలి అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మచిలీపట్నానికి చెందిన కుక్కల వీర వెంకట సత్యనారాయణ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. తొలుత బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మానవ హక్కుల సంఘం నూతన కార్యాలయాన్ని సంఘ జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం బాధ్యతల స్వీకారోత్సవం నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం నినాదంతో తమ సంఘం పనిచేస్తోందన్నారు. ప్రజలు చెప్పే సమస్యలను ఓపికగా విని పరిష్కార దిశగా తమ సంఘం పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను సంఘ జాతీయ నాయకులు, జిల్లా నాయకులు సత్కరించారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నందం నరసింహారావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొండ విజయలక్ష్మి, రాష్ట్ర లీగల్ సెక్రటరీ రాజ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మౌలాలి, ఉపాధ్యక్షుడు శేషం నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా వేడుక



జెండా తీసుకువస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ఘంటసాల(అవినిగడ్డ): ఘంటసాల మండలం లంకపల్లి మసీదులో గ్యార్వీ షరీఫ్ వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హజరత్ గౌసే ఆజం గ్యార్వీ షరీఫ్ వేడుకను పురస్కరించుకుని ఘంటసాల ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ ముస్లిం యువతతో కలిసి జెండా ఊరేగింపులో పాల్గొన్నారు. జెండాను తీసుకొచ్చి మసీదు సమీపంలో పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హిందూ ముస్లింలు ఐక్యంగా ఉంటూ గ్యార్వీ షరీఫ్ వేడుక చేసుకోవడం అభినందనీయమన్నారు. వైస్ ఎంపీపీ మోడెం నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో ఏ పండుగ వచ్చినా మతాలకు అతీతంగా అందరూ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ వలీ, పలువురు ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద అన్నసమారాధనలు



ఈడేపల్లి శక్తిగుడి వద్ద అన్నసమారాధన



కాసానిగూడెంలో శక్తిపటాల వద్ద పూజలు

చిలకలపూడి(మచిలీపట్నం): నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల వద్ద ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. ఈడేపల్లి శక్తిగుడి వద్ద భక్తులు మొక్కులు చెల్లించి దేవాలయానికి అందజేసిన పోతులు, కోళ్లతో వేలాదిమందికి అన్నసమారాధన చేశారు. భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు అర్జా నరసింహారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నగరంలోని కాసానిగూడెంలో అభయాంజనేయస్వామి గుడి వద్ద నవరాత్రుల సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. శక్తిపటాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి మొక్కులు చెల్లించిన అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. మరీదు తార ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



రత్తయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గొర్రెపత్తి రమణ ఇటీవల మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదివారం పరామర్శించారు. మృతురాలి భర్త రాంబాబును రమణ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కోడూరుకు చెందిన రేపల్లె రత్తయ్య గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. రత్తయ్యను కూడా ఎమ్మెల్యే రమేష్‌బాబు పరామర్శించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వెన్నా ప్రసాద్, కోట పద్మావతి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ ప్రారంభం

అవనిగడ్డ: తెల్లకార్డు దారులకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వి. పార్వతీదేవి కోరారు. స్థానిక పంచాయతీ పరిధిలోని నాలుగో వార్డులో నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన బియ్యాన్ని రేషన్ ద్వారా పేదలకు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● ఎరక్కపోయి ఇరక్కుంది!



మోపిదేవి బస్టాండ్ వద్ద డబ్బాతో శునకం

గ్రామ సింహానికి కష్టమొచ్చింది. మనుషులను ఎంత భయపెట్టినా ఒక్కోసారి వారి సాయం కూడా అవసరం అవుతోందని ఈ శునకానికి తెలిసి వచ్చింది. మోపిదేవిలో సంచరిస్తున్న ఓ శునకం బస్టాండ్ సమీపంలో ఆదివారం ఓ ప్లాస్టిక్ డబ్బాలో తలదూర్చింది. తల డబ్బాలో ఇరుక్కుపోయింది. ఏమి జరిగిందో అర్థం కాక కుయ్‌కుయ్ మంటూ అటూఇటూ తిరిగింది. తల విదిలిస్తూ ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. ఈ దృశ్యాన్ని చూసిన ఓ వ్యక్తి ధైర్యం చేసి కుక్క వద్దకు వెళ్లి చాకచక్యంగా కుక్క తలకు ఉన్న డబ్బాను తొలగించాడు. బతుకు జీవుడా అనుకుంటూ కుక్క అక్కడి నుంచి పరుగు తీసింది. -మోపిదేవి

అలరించిన పాట కచేరి



గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాలులో స్పందన కల్చరల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్కవరం శ్రీనివాస్ బృందం నిర్వహించిన అక్కినేని వారి ఆపాత మధురం సినీ గీతాలాపన పలువురిని ఆకట్టుకుంది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన ప్రముఖ గాయకులు ప్రేక్షకులను అలరింపజేశారు. స్పందన గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గౌరవ సలహాదారు కేఎస్ అప్పారావు, అధ్యక్షుడు గవిర్నేని బాబూ శ్రీకర్, ఉపాధ్యక్షులు మట్టా రాజా, పీవీ సత్యనారాయణ, కార్యదర్శి నరహరిశెట్టి ప్రసాదు, సహ కార్యదర్శి వంగా శ్రీనివాస్ (వంశీ), కోశాధికారి కొనకళ్ల సీతయ్య, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కేవీఎస్‌టీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గుల్లలమోద(నాగాయలంక): గ్రామానికి చెందిన చింతా ఆదిశేషారావు నెల రోజుల కిందట పక్షవాతానికి గురయ్యాడు. ఇంటి వద్దనే ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న అవనిగడ్డలోని శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ. 7 వేల ఆర్థిక సాయం చేశారు. ఆదివారం గ్రామ పెద్దల సమక్షంలో వారి చేతుల మీదుగా బాధితునికి ఈ మొత్తాన్ని అందజేశారు. మత్స్య సొసైటీ చైర్మన్ చింతా పాపారావు, చింతా సుబ్బారావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై కళాజాతా



జమీగొల్వేపల్లిలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

జమీగొల్వేపల్లి(పామర్రు): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డు వారి సౌజన్యంతో మండలంలోని జమీగొల్వేపల్లిలోని స్థానిక పీఏసీఎస్ వద్ద డిజిటల్ లావాదేవీలపై కళాజాతా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షురాలు కనుమూరి ధనలక్ష్మి మాట్లాడుతూ బ్యాంక్ అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతాలను ప్రారంభించాలన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం, రూపే, డిబెట్ కార్డులను ఏవిధంగా వినియోగించాలనే అంశాలను కళాజాతా బృంద సభ్యులు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వల్లభనేని బుల్లిబాబు, కొల్లి గోపాలకృష్ణ, వి. నాగేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ శ్రీలక్ష్మి, సిబ్బంది చిన్ను, స్థానికులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా భూముల కొనుగోలు

ఉయ్యూరు ఆర్డీఓ రాజు



రైతులతో మాట్లాడుతున్న ఉయ్యూరు ఆర్డీఓ రాజు

పామర్రు: రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని పేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసే జగనన్న కాలనీలకు అవసరమైన భూములు కొనుగోలు చేస్తామని ఉయ్యూరు ఆర్డీఓ దాసి రాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన ఫిర్యాదు దారులైన రైతులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ కోసం కొనుగోలు చేసిన భూముల పక్కనే ఉన్న రైతులు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులతో సమావేశమైనట్లు చెప్పారు. గతంలో ఏర్పాటు చేసిన కాలనీ పక్క భూములను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గమనించి మరో మారు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని వివరించారు. భూముల విషయంలో రైతులు ఎవరికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. అన్ని శాఖల అధికారులు, రైతులతో కలిసి క్షేత్ర పరిశీలనకు సోమవారం హాజరు కావాలని ఆదేశించారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, రెవెన్యూ అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు హోమియో వైద్య శిబిరం

చల్లపల్లి: చంద్ర రాజేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తామని ట్రస్ట్ సభ్యుడు అడ్డాడ ప్రసాద్‌బాబు తెలిపారు. హోమియో వైద్య నిపుణులు స్త్రీ, పురుషుల దీర్ఘకాలిక వ్యాధులకు అవసరమైన పరీక్షలు చేసి సీఆర్ ట్రస్ట్ తరపున ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.